

# ఆసరా

పి.ఎం. సుందరరావు

**''ఇప్పుడు లతను ఏం చేద్దామనుకుంటున్నారండీ?'' అంది మనసు ఉండబట్టలేక పార్వతమ్మ.**

**''ఇందులో పెద్దగా ఆలోచించాల్సిన పనేముంది. వెరీ సింపుల్. వచ్చిన దారినే భర్త ఇంటికి వెళుతుంది. చావైనా, బతుకైనా భర్త కాళ్ళ దగ్గర పడుండమనే కదా మనం పెళ్ళి చేసింది'' అన్నాడు మామూలు విషయంలాగా రాజేశ్వరం.**

ఆ మాటలు అంటున్న భర్త రాజేశ్వరం వంక ఆశ్చర్యంగా చూసింది పార్వతమ్మ.

''భర్త దగ్గర ఉండలేని స్థితిలోనే కదండీ అది కట్టుబట్టలతో పుట్టింటికి వచ్చింది. నాకు భర్త లేకపోయినా, కొండంత అండగా తల్లిదండ్రులున్నారనే కదండీ. ఇప్పుడది మనల్ని వెతుక్కుంటూ వచ్చింది'' అంది పార్వతి కాస్త నిదానంగా.

''ఏమిటే! ఎన్నడూ నోరు మెదపనిదానివి. ఈ రోజు ఇలా మాట్లాడుతున్నావు. ఇది భార్యాభర్తల వ్యవహారం. వాళ్ళిద్దరూ ఏమనుకున్నారో ఏమో. ఏదో చిన్నది కదా. పుట్టింటికి పరుగుతీసుకొస్తే, నాలుగు మంచి మాటలు చెప్పి భర్త దగ్గరికి పంపించాలి గాని, ఇంట్లో పెట్టుకుంటామా? అదేం కుదర్దు. ఇంకాసేపటిలో ట్రైన్ ఉంది వెళ్ళమని చెప్పు నీ కూతుర్ని'' అన్నాడు రాజేశ్వరం ఇంకొక్క క్షణం కూడా ఇంట్లో ఉంచొద్దన్నట్లు చూస్తూ.

''అది కాదండి. ఎంతో తప్పనిసరి పరిస్థితి అయితే తప్ప మనమ్మాయి ఇల్లు వదిలి రాదండీ. అయినా మనకు తెలిసిన సంగతే కదా. అల్లుడు భాస్కరం పరిస్థితి. అసలు ఇదంతా మీరే చేశారండి. పెళ్ళికి ముందే అల్లుడు మంచివాడు కాదని తెలిసి కూడా, తక్కువ కట్నంతో వదిలించుకోవచ్చని, అలాంటి వాడికి కట్టబెట్టారు. మీకేం? ఇప్పుడు బాధపడుతుంది నా కూతురే కదా'' అంది ఉక్రోషంగా పార్వతమ్మ.

పక్కగదిలో ఉన్న లత, ఆ మాటలు విని తండ్రి మీద ఉన్న కాస్త ప్రేమను కూడా చంపుకుంది.

''అంటే. అది నీకు ఒక్కదానికే కూతురంటావు. నాకు కాదన్నమాట'' కోపంగా పలికాడు రాజేశ్వరం.

''అవునండీ! అది మీ కూతురు కాదనుకునే, తెలిసి కూడా అలాంటి దుర్మార్గుడికి కట్టబెట్టారు'' కచ్చితంగా పలికింది.

ఎన్నడూ పన్నెత్తి మాటనని తన తల్లి, ఆ రోజు తన తరపున అంత కచ్చితంగా మాట్లాడటం, అంత దుఃఖంలోను కాస్త సంతోషం కలిగింది లతకి.

''ఏంటే? ఎక్కువగా మాట్లాడుతున్నావు. వంటింటి కుందేలువి నీకేం తెలుసు. లక్షలకు లక్షలు కట్నం పోసి ఉత్తముడ్ని తీసుకురావటం అనవసరమనుకునే, అలాంటి వాడికి దాన్ని కట్టబెట్టాను. అసలు దాన్ని పురిట్లోనే చంపితే ఉండేదే కాదు. అబ్బో! నా బంగారు తల్లి అంటూ, కిందపడకుండా పెంచావు. అదే ఇప్పుడు గుండెల మీద కుంపటై కూర్చుంది. ఏం చేస్తుందో, ఎక్కడికెళుతుందో నాకనవసరం. సాయంత్రం నేను వచ్చేసరికి, అది ఇంట్లో ఉండకూడదు'' అంటూ హెచ్చరించాడు రాజేశ్వరం.

ఆ మాటలకు ఏదో అనబోతుండగా, పార్వతమ్మ చెంప ఛెళ్ళుమనిపించి ''ఏమిటే పైసా సంపాదించనిదానివి, ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న వాడిని, భర్తని, నన్నే ఎదిరించి మాట్లాడతావా?'' అంటూ మండిపడ్డాడు రాజేశ్వరం.

మారుమాట్లాడకుండా పార్వతమ్మ ఏడుస్తూ అలాగే నిల్చుండిపోయింది.

''నీ కూతురిని ఏం చేస్తావో, ఎలా పంపిస్తావో నాకనవసరం. సాయంత్రం నేను ఆఫీసు నుంచి వచ్చేసరికి ఈ ఇంట్లో ఉండకూడదు'' అంటూ కోపంగా ఆఫీసుకెళ్ళిపోయాడు రాజేశ్వరం.

తల్లిదండ్రుల వాదన విని ఆ ఇంటికి ఎందుకు వచ్చానా? అని బాధపడసాగింది లత.

కానీ ఆ రోజే తన తల్లిదండ్రుల ఇద్దరిలో తనపై తల్లికి ఎంత ప్రేమ ఉందో, తండ్రికి ఎంత ప్రేమ ఉందో అర్థం చేసుకుంది.

తల్లి మీద విపరీతమైన ప్రేమ కలిగింది మనసులో.

ఈ లోకంలో తండ్రులంతా దుర్మార్గులు, తల్లులంతా దేవతలు - అనే అభిప్రాయం కలిగింది.

లతకు ఆ అభిప్రాయం కలగటం, లత విషయం వరకు కరక్టే.

చిన్నప్పటి నుండి, లత విషయంలో తల్లిదండ్రులిరువురికి తగాదాలే.

''ఈ పిల్లకు ఎందుకే ఇంత ఖరీదైన బట్టలు...'' అంటాడు రాజేశ్వరం.

''ఆడపిల్లయినా, అది మన పిల్ల కదా! నాకు బట్టలు తీసుకోకపోయినా ఫర్వాలేదు. దానికి మాత్రం మంచి బట్టలు తీసుకురావాల్సిందే'' అని వాదించేది పార్వతమ్మ.

చదువు విషయంలో కూడా అంతే.

లతకు ఆరో సంవత్సరం రాగానే ''ఆడపిల్లలకు చదువెందుకే?'' అని వాదన పెట్టుకున్నాడు రాజేశ్వరం.

''నా బంగారు తల్లిని చదివించాల్సిందే'' అంటూ పట్టుబట్టి స్కూల్లో చేర్పించింది పార్వతమ్మ.

హైస్కూల్లో చేర్పించేటప్పుడు కూడా ''లతను హాస్టల్లో చేరుస్తాను'' అన్నాడు.

''వద్దండీ! అది మన ఎదురుగా తిరుగుతుంటే మనకు ఆనందం. దానికి ఆనందం. అంతేగాని, అది హాస్టల్లో, జైలులో ఉన్నట్టు ఉండటం మనకు బాగోదండి'' అంటూ హాస్టల్లో చేర్పించకుండా, ఇంట్లోనే ఉంచి చదివించసాగింది.

కాని లత విషయంలో అదే పెద్ద పొరపాటైంది.

ఇంట్లో ఎదురుగా ఉండటాన లత ఎదుగుతున్నకొద్దీ, రాజేశ్వరం సాధింపులు ఎక్కువయ్యాయి.

తత్ఫలితంగా లత పదవ తరగతి ఉత్తీర్ణురాలు కాలేకపోయింది.

అంతటితోనే చదువుకి ఫుల్‌స్టాప్ పెట్టాల్సి వచ్చింది.

లత భవిష్యత్ కోసం, రాజేశ్వరం ఏ విధమైన శ్రద్ధ తీసుకోలేదు. పైగా ఎవరో ఒకరిని కట్టబెట్టి ఎప్పుడు బయటకు గెంటేద్దామా అనే తొందరతో, చిన్న ఉద్యోగస్తుడైనా తాగుడు, వ్యభిచారం, జూదం లాంటి దుర్గుణాలుగల భాస్కరంతో పెళ్ళి జరిపించాడు. పెళ్ళి చేసింది మొదలు కూతురు వంక కన్నెత్తి చూడలేదు. భార్య పార్వతమ్మను కూడా ఆ ఇంటికి పంపించి ఎరగడు.

మిగిలిన ఇద్దరు కొడుకులను ఉన్నత చదువులు చదివించటంలోనే నిమగ్నమయ్యాడు రాజేశ్వరం.

తల్లికి మాత్రం కూతురు లతంటే ప్రాణం. క్షణక్షణం కూతురు కోసం కొట్టుకుంటుంది. కానీ ఏం ప్రయోజనం. ఏ మాత్రం ఆమెకు ఇంట్లో స్వాతంత్ర్యం లేదు. ఆమె మాటను రాజేశ్వరం ఖాతరు చేయడు. కొడుకులు అసలే పట్టించుకోరు.

మంచం మీద రెండు కాళ్ళ మధ్య తల పెట్టుకుని ఏడుస్తున్న లత, తల పైకెత్తి చూసింది. గదినిండా చీకటి. తన జీవితంలాగా. తన జీవితంలోనే కాదు, ఆడదాని జీవితంలోలాగా - అనుకుంది.

ఆడపిల్లగా పుట్టడం తను చేసిన పాపమా? సృష్టికి మూలం స్త్రీ అన్నారు. ప్రతి మగాడి విజయం వెనుక ఒక స్త్రీ ఉంటుందన్నారు. బిడ్డకు మొదటి గురువు స్త్రీ అన్నారు. మరి అలాంటి స్త్రీ నేడు చులకనగా చూడబడుతుంది. పుట్టింట, భర్త ఇంట ఎందుకు ఇన్ని హింసలు పడాల్సి వస్తుంది. ఈ దుష్టచర్యలకు అంతం లేదా? అని ఆలోచించసాగింది లత మనసు.

ఇప్పుడు కర్తవ్యం ఏమిటి? గమ్యం ఏమిటి? అసలు ఎక్కడుండాలి? ఏది ఏమైనా ఈ ఇంట్లో మాత్రం ఉండకూడదు. భర్త దగ్గరకు అసలు వెళ్ళకూడదు. మరి చావే శరణ్యమా?

అది తలచుకోగానే వెన్నెముకలో సన్నని వణుకు. క్రమంగా అది ఒళ్ళంతా పాకింది. శరీరమంతా చలికి గజగజ వణికినట్లు వణకసాగింది. గదిలో చీకటి మరింత చిక్కనైనట్టనిపించింది.

ఈ సమస్యకు పరిష్కారం ఏమిటి?

ప్రపంచం చాలా విశాలమైన దంటారు కదా! ఈ సువిశాల ప్రపంచంలో కాస్తంత చోటు కూడా దొరకదా? ఏమో? అనుమానం. అనుమానం పెద్ద రోగం. అనుమానం మనిషిని కృంగదీస్తుంది. మళ్ళీ రెండు కళ్ళ నుండి కన్నీళ్ళు జలజల రాలాయి. రెండు కాళ్ళ మధ్య తల పెట్టుకోబోయింది.

తలుపు కాస్త తెరుచుకుంది. కాస్త వెలుగు. గదినిండా పరుచుకుని చీకటిని పారద్రోలటానికి ప్రయత్నిస్తుంది ఆ వెలుగు.

వెంటనే రెండు తలుపులు తెరుచుకున్నాయి. గది నిండా వెలుగు అలుముకుంది. చీకటి అంతా మాయం. తలపైకెత్తి చూసింది లత.

ఎదురుగా తల్లి. తల్లిని చూడగానే ఏడుపు ఎక్కువైంది. మంచం దగ్గరకు వచ్చి, లత తలమీద చేయివేసి ''పిచ్చిపిల్ల ఏడవకు'' అంటూ ఓదార్చింది పార్వతమ్మ.

తల్లి చల్లని చేతి స్పర్శకు, ఆ మాటకు ఎక్కిళ్ళు పెడుతూ, వస్తున్న దుఃఖాన్ని ఆపుకోటానికి ప్రయత్నించింది.

ఎదురుగా మంచం మీద కూర్చుంది పార్వతమ్మ. ''అమ్మా! నిన్ను ఆ దుర్మార్గుడి దగ్గరకు వెళ్ళి చావును కొనితెచ్చుకోమని చెప్పను. నువ్వు అక్కడికెళ్ళొద్దు'' అంది.

''మరి ఈ ఇంట్లో ఉండటం సాధ్యమేనా?'' అనే అనుమానంతో చూసింది తల్లికేసి.

ఆ అనుమానాన్ని గ్రహించిన పార్వతమ్మ కాస్త తటపటాయించి - ''నేను చేసిన పొరపాటల్లా, నా కాళ్ళ మీద నేను నిలబడి బతికే శక్తిని సంపాదించుకోలేక పోవటమే. బహుశా కొందరు మగాళ్ళు భార్య పనిచేయటానికి ఇష్టపడంది, వంటింటికే పరిమితం చేసేది, తమ చెప్పుచేతల్లో ఉండటానికేనేమో. నిన్ను ఎంతో బాగా చదివించి, ఒక మంచి ఉద్యోగస్తురాలిని చేయాలనుకున్నాను. కానీ నా ఆశ నిరాశ అయింది'' అని ఇక మాట్లాడలేక ఆగిపోయింది గొంతు దుఃఖంతో పూడుకుపోవటంతో.

''అమ్మా! నాకిక్కడ పరిస్థితి అంతా అర్థమైంది. నువ్వు నిమిత్తమాత్రురాలివి. నాకిక్కడ స్థానం లేదు. వెళతానమ్మా! నాకూ ఒక స్థానం కావాలి. అందుకోసమే ప్రయత్నిస్తాను'' అంటూ కళ్ళనీళ్ళు తుడుచుకుని, ఒక బ్యాగ్‌లో కొంత సామానును సర్దుకుంది.

పార్వతమ్మ పక్కగదిలోకి వెళ్ళి, చేతిలో కొంత డబ్బుతో తిరిగి వచ్చి ''అమ్మా! తొందరపడి ఏ కష్ట సమయంలోను ఎలాంటి అఘాయిత్యానికి పాల్పడబోకమ్మా!'' అంది చేతులు పట్టుకుని.

తల అడ్డంగా ఊపి, తనకు తీసుకోవాలని లేకపోయినా, తల్లి మనసును కష్టపెట్టడం ఇష్టం లేకపోయినా వాటిని తీసుకుని, కళ్ళతోనే వీడ్కోలు చెప్పి, ఆ ఇంటి నుంచి బయటపడింది లత.

సరాసరి అదే నగరంలో ఉంటున్న తన స్నేహితురాలు మాలతి ఇంటికి దారితీసింది.

మధ్యలో ఎన్నెన్నో ఆలోచనలు. ఆ ఆలోచనలతో సతమతమవుతూ మాలతి ఇదివరకు రాసిన లెటరులోని అడ్రసు ప్రకారం ఆ ఇంటి ముందుకొచ్చి ఆగింది.

మూసి ఉన్న గేటును తెరచి లోపలికి ప్రవేశించింది.

అటువైపుకి తిరిగి సన్నజాజి తీగను పందిరి మీదకు మళ్ళిస్తోంది మాలతి.

''మాలతీ'' అంటూ చిన్నగా పిలిచింది లత.

వెనక్కి తిరిగి చూసి ''హాయ్ లతా! ఎన్నాళ్ళకి కనిపిస్తున్నావే'' అంది వచ్చి ఇంట్లోకి తీసుకెళుతూ.

'అవును. చాలా రోజుల నుంచి ఉత్తరాలు రాయటమే తప్ప నిన్ను కలవటంలేదు' అనుకుంది మనసులో లత.

అలసటతో ఏం మాట్లాడలేక మౌనంగా కూర్చుండిపోయింది సోఫాలో లత.

మాలతి పరిస్థితిని అర్థం చేసుకుని, ఫ్యాన్‌వేసి, మంచినీళ్ళు తీసుకొచ్చి ఇచ్చింది.

గటగటా తాగి ఖాళీ గ్లాసును టీపాయ్ మీద పెట్టి, కాస్త తేరుకుని విషయాన్నంతా వివరించి చెప్పింది లత.

''దీనికి పరిష్కారం చూపించాల్సింది నీవే'' అని మాలతి వైపు చూసింది.

''భర్త కాదు పొమ్మన్న తర్వాత పుట్టిల్లే శరణ్యం స్త్రీకి. వారు కూడా కాదంటే ఇక ఆత్మహత్య తప్ప వేరే మార్గం లేదు లతా. ఒంటరిగా వున్న స్త్రీని సమాజం బతకనివ్వదు. భయంకరమైన ఈ మగతోడేళ్ళ మధ్య ఏ స్త్రీ ఒంటరిగా బతకగలుగుతుంది. అందుకే మరణమే శరణ్యం'' అని ఆగిపోయింది జాలిగా చూస్తూ మాలతి.

అది విన్న లతకు నోటిమాట రాక అలాగే చూస్తుండిపోయింది మాలతికేసి.

భుజం పట్టుకుని కదుపుతూ ''పిచ్చి లతా అలా అంటాననుకున్నావా?'' అని అంది నవ్వుతూ.

ఆ మాటకు తేరుకుని ''ఒక్క క్షణం హడలుగొట్టేశావు కదే'' అంటూ తాపీగా సోఫాలో వెనక్కి వాలి కూర్చుంది లత.

''లతా! పరుల మీద ఆధారపడి బతికే ప్రతి మనిషి కూడా అందరికీ లోకువగానే కనిపిస్తాడు. ప్రస్తుతం స్త్రీల పరిస్థితి కూడా అంతే. చాలామంది స్త్రీలు భర్తల మీద ఆధారపడి బ్రతికేవారే. అలాంటి వారందరూ తమ భర్తలకు లోకువే. నీవు కూడా అలా చూడబడ్డదానివే. అందుకే...''

''ఏదైనా పనిలో చేరమంటావా? చెప్పు మాలతీ! నేనిప్పుడు పాచిపనులు చేయటానికైనా సిద్ధమే''

''ఆవేశపడకు లతా! సృష్టిలో ఉత్కృష్టమైనది విద్య నేర్చిన స్త్రీ అన్నాడు గురజాడ. ముందు నువ్వు కష్టపడి చదువు. తర్వాత ఏదైనా ఉద్యోగం చూద్దాం. అప్పుడే సమాజంలో నీకో ఉన్నత స్థానం లభిస్తుంది. అప్పుడు నీ భర్త, నీ వాళ్ళు అందరూ నిన్నే వెతుక్కుంటూ వస్తారు. అప్పటిదాకా నిన్ను, నేను పోషిస్తాను లేదంటే నాకు తెలిసిన చోట చిన్న ఉద్యోగం ఇప్పిస్తాను'' అంది మాలతి. ఆ సలహా బాగా నచ్చింది లతకు.

ఆసరా లేని బతుకుకు ఒక ఆసరా కావాలి. అది వృత్తి కావచ్చు. ఉద్యోగం కావచ్చు. ఏదైనాగాని, ఇతరుల మీద ఆధారపడకుండా, స్వయంగా బతికే అవకాశం. అందమైన తీగకు, పందిరి కావాలి. అప్పుడే అది పైపైకి పాకుతుంది. పెరిగి పుష్పిస్తుంది ఆలోచిస్తోంది.

''మాలతి! నేను చదువుకుంటాను. డిగ్రీ పూర్తి చేస్తాను. అయితే నన్ను, నువ్వు పోషించటానికి మాత్రం ఒప్పుకోను. ఏదో ఓ చిన్న ఉద్యోగం చేస్తాను'' అంది లత రేపటిలోకి మళ్ళుతూ.

★